# గానుగెద్దు

అదొక మామూలు గ్రామం!

అక్కడ కొద్దిమందే జనాభా!!

వారిలో ఒకరిద్దరు కామందు (రాబందు) లున్నారు.

మిగతావాళ్ళు కష్ట జీవులు.... పొట్టగడవని దౌర్భాగ్యులు... బ్రతుకు వెళ్ళమార్చగల అవకాశం లేని నిర్భాగ్యులు... నికృష్టులు!

అయినా వారందరిలోనూ రక్త మాంసా లున్నయ్. బ్రతకాలనే తాపత్రయం వుంది.

వారిలో ఆకలి వుంది. అవసరాలూ వున్నయ్.

మరమనుష్యుల్లా బ్రతకటం వారసత్వపు హక్కు.

తుమ్మల తోపు దాటి.... డొంక రోడ్డు మీదుగా నడుస్తున్నాడు ముసలయ్య.

నడుస్తున్న ముసలయ్యలో అశక్తత!

ఎండిన డొక్కలు... చప్పిదవడలు... పీక్కుపోయిన కళ్ళు... సగం నెరిసిన తల... అరటి పూచల్లాంటి కాళ్లు... బలపాల్లాంటి చేతులు.. శరీరమంతటా ఉబ్బుకొచ్చిన నరాలు.. రాతిమీద చెక్కిన గ్రీకు శిల్పంలా అవుపిస్తున్నాడు.

నాలుగు పదులు నిండని ముసలయ్య... జవసత్వా లుడిగి... చావుకి సిద్ధమైన వాడిలా వున్నాడు.

ముసలయ్యలో ఆశ లేకపోయినా ఆకలి తీర్చగలిగే టందుకో అర్ధాంగి వుంది? భార్యా భర్తల దారిద్ర్యాన్ని పంచుకుందుకు ఇద్దరు పిల్లలూ వున్నారు.

నడుస్తున్న ముసలయ్యలో ఆవేదన... ఆరాటం.... ఆందోళన... భయం... ఇంకా ఎన్నో...

ఈ ప్రపంచంలో తనకి మిగిలివున్న ఆస్థి అల్లా భార్య అలివేలు!

పదిహేను రోజులుగా అలివేలు మూసిన కన్ను తెరవ కుండా కుక్కిమంచంలో పడివుంది.

ఆ ఊరి ఆస్థాన వైద్యుడు ఆచారి కంట్లో కలికం వేసి గుళికలేవో ఇస్తున్నాడు.

అయినా అలివేలు జబ్బు తగ్గుముఖం పట్టలేదు.

తీరా ఓ గంట క్రితం అలివేలు నాడి పరీక్షించిన ఆచారి పెదవి విరిచాడు.

అలివేలు బ్రతకాలంటే పట్నం తీసుకెళ్ళి పెద్దాసుపత్రిలో చేర్పించి ఇంగ్లీషు మందులు ఇప్పించాలన్నాడు.

ఆ మాట విన్న ముసలయ్య ప్రాన్పడ్డాడు. కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు.

పట్నం... పెద్ద డాక్టరు...

అలివేలుని బ్రతికించుకోవాలి...

డబ్బు కావాలి? — ఎట్లా? ఏం చేయాలి?...

నడుస్తున్న ముసలయ్యలో అనంతమైన ఆలోచన్లు...

పరుగులాంటి నడకతో... వడివడిగా... పెద్దపెద్ద అంగలేసుకుంటూ రొప్పుకుంటూ... కాళ్ళకు చెప్పులు లేకుండా... ఎర్రని ఎండలో నడుస్తున్నాడు...

నాలుక పిడచకట్టుకుపోతోంది... శరీరం తూలుతోంది... కళ్ళు బైర్లుకమ్ముతున్నయ్...

వచ్చివచ్చి కామందు కనకయ్య డాబా ఇంటి ముందు ఆగేడు.

'ఏరా లం ... కొడకా ... రెండు రోజులుగా కంటికి కన్పించటమే మానేశావ్...!'' బకాసురుడిలా వున్న కనకయ్య హుంకరించేడు ముసలయ్యని చూడగానే.

క్షణం సేపు ముసలయ్య నోటివెంట మాట రాలేదు. ఎండలో రెండు మైళ్ళు నడిచివచ్చినందుకే ముసలయ్యకు

పోషవచ్చినట్లయింది. దానికితోడు కామందు పలుకరింపుకి మనిషి మరింత చచ్చిపోయాడు.

'ఆడదానికి సుస్తీగా వుందయ్యా...' తడి ఆరిన ముసలయ్య గొంతులోంచి పెగుల్చుకొచ్చాయి మాటలు.

'దానికి మాయరోగమైతే నీకేమొచ్చింది? పన్లోకి రాకపోతే నీకు నాకలెట్లావస్తయ్?"

"ఎట్లాగైనా... తమరు ఆదుకోవాల..." ధైర్యం చేసి అడిగేడు.

"డబ్బు కావలసి నా దగ్గరకు లగెత్తుకొచ్చావా లం...కొడకా ." దీర్ఘాలు తీస్తూ బొంగురు గొంతుతో మరోసారి శాపనార్థం పెట్టేడు కనకయ్య.

"అవసరం పిలకమీద కొచ్చినాది బాబూ..." కామందు కాళ్లదగ్గరగా చతికిలబడుతూ దీనాతి దీనంగా అర్థించాడు.

"నీ అయ్య సొత్తేమైనా దాచుకున్నావా నా దగ్గర?.."

"బాబ్బాబు!... మీ కాళ్లుపట్టుకుంటాను..."

"కాళ్ళు పట్టుకుని లాభంలేదు. నీ ఆలి మెడలో మంగళ సూత్రం ఏదైనావుంటే పట్టుకురా..." ఆరిపోయిన చుట్ట మళ్ళీ వెలిగించాడు.

"అది సావు బతుకుల్లో వుంది బాబూ..."

"ఇదిగో చూడు... అవసరం అవసరం అంటూ ఇప్ప టికే నాలుగు సార్లు నాలుగుపాతికలు పట్టుకెళ్ళేవు. ఆ అప్పు తీరనేలేదు. మళ్ళీ చెయ్యి చాచి ప్రయోజనం లేదు..." మొండి చెయ్యి చూపేడు కనకయ్య.

"సచ్చి మీ కడుపున బుడతాను... నా చరమం వల్చి మీకు సెప్పులు కుట్టిత్తాను..." రోదన ధ్వనించింది.

"ఎద్దు కుంటిదై యాపారం సాగటం లేదు. ఇవేల్టికి గానుగాడించి రెండు రోజులైంది. నూనె కావాలంటూ జనం తిరిగిపోతున్నారు .." ముసలయ్య ముఖంలోకి ఎగాదిగా చూశాడు కనకయ్య.

"ఈ వక్కసారికి ఆదుకోండి బాబూ!... అది బతికి బట్టకడితే... ఇద్దరం మీకాడే శాకిరీ సేసి మీ ఋణం తీర్చు కుంటాం..."

కాదన్నాడు. లేదన్నాడు. 'ఛీ' అన్నాడు. 'ఛ' అన్నాడు కనకయ్య.

కాళ్ళకు చుట్టుకున్న పాము కరవక మానదన్పించింది కనకయ్యకి.

అసలే పెళ్ళిళ్ళ సీజను.

నూనె కావాలంటూ జనం తిరిగి వెడుతున్నారు.

డబ్బా నూనె తన దగ్గరున్నా కనీసం యాభై రూపాయలు

లైనా లాభం గిట్టుబాటౌతుంది. పైగా కల్తీ చేస్తే మరి కొంచెం ఎక్కువే ముదుతుంది.

గానుగాడిస్తేగాని నూనె రాదు — నూనె వస్తే గాని వ్యాపారం సాగదు.

ముసలయ్యకి డబ్బు కావాలి! తనకు నూనె కావాలి!!

ఇద్దరూ అవసరంలోనే వున్నారు.

"చూడు ముసలయ్యా! నా యింట్లో రెండు చద్ది మెతుకులు తిను! తిని.... నాకు సాయంచేసి పెట్టు. నువ్వు అడిగినంత కాకపోయినా కొద్దో గొప్పో నీకు అప్పిస్తాను. సరేనా?..."

పరిస్థితి అర్థం కాని ముసలయ్య తెల్ల మొహం వేశాడు.

"గానుగాడించాలి ముసలయ్యా..." చావు కబురు చల్లగా చెప్పేడు.

తనని ఇరకాటంలో పడేస్తున్నాడు కనకయ్య. అడకత్తెరలో పెడుతున్నాడు.

అవసరం తనది. అవకాశం కామందుది!!

"ఏం.... ఈమాత్రానికే చచ్చిపోవులే" చుట్ట పీకను దూరంగా విసిరేస్తూ వెటకారంగా అన్నాడు కనకయ్య.

కనకయ్య తనపాలిట దేవుడు!

తన తండ్రి కామందు తండ్రికాడే పనిచేశాడు. వార

సత్వపు హక్కుని సంతరించుకున్న తను.... కనకయ్యకే అంకితమైపోయి బతుకుతున్నాడు.

అందుకే కామందు మాట కాదన్లేడు.

మరొక చోటెక్కడా తనకు అప్పుపుట్టదు.

ఊరి చివర సగం కూలిపోయిన పూరి పాక... వంటి మీదున్న చినిగిన బట్ట... తాగే గంజి... వేడి చల్లారి వంట్లో ప్రవహిస్తున్న నెత్తురు... అన్నీ కామందు కనకయ్య స్వంతం!!

చద్దిమెతుకులుకూడాతినాలన్పించటంలేదు ముసలయ్యకి.

కూర్చున్న వాడల్లా లేచాడు.

అడుగులో అడుగేసుకుంటూ కామందు డాబా ఇంటి వెనగ్గావున్న పాకలోకి నడిచాడు.

నేరుగా వచ్చి నూనె గానుగ కాడి ముందు నిల్చున్నాడు.

రెండు చేతులతో కాడి ఎత్తి భుజంమీద పెట్టుకున్నాడు.

కాడి జారిపోకుండా తాడు బిగించాడు కనకయ్య.

దున్నపోతు మీదెక్కిన యముడిలా గానుగ కుదుటి మీద కూర్చున్నాడు కనకయ్య.

అలవాటు ప్రకారం చర్నాకోల పట్టుకుని ఛో... ఛో... అంటూ అదిలించాడు.

ముసలయ్య మెల్లగా తిరగటం ప్రారంభించాడు.

తిరుగుతున్న ముసలయ్యలో అనేక రకాల ఆలో చన్లు ..

తాను మనిషా ? పశువా ?

పశువులోనూ రక్తమాంసాలుంటాయ్. చెప్పిన పనల్లా చేస్తుంది. ఇప్పుడు తనూ అంతే!

పశువు గడ్డి తింటుంది!— ఇన్నేళ్ళుగా కామందు కన కయ్య అంతకంటే మంచితిండేమీ పెట్టటంలేదు తనకు...

నువ్విట్లా పెళ్ళినడక నడిస్తే తెల్లారేలోగా మనం అర డబ్బా నూనె కూడా ఆడించలేం..." రంకె వేశాడు ముసలయ్య.

మూర్లోవున్న గంత తీసి ముసలయ్య కళ్ళకి కట్టేడు.

మరోసారి ముసలయ్యను అదిలించాడు.

నీరసం పూర్తిగా ఆవరించింది ముసలయ్యను.

రొప్పుతున్నాడు .. ఆయాసపడుతున్నాడు. అయినా తిరుగుతూనే వున్నాడు.

చెమటలు కక్కుతున్నాడు.

అశక్తతతో తిరుగుతున్నాడు.

ఆశతో తిరుగుతున్నాడు.

అవసరంకోసం తిరుగుతున్నాడు.

చీకటిపడ్డది,.....

'వెట్టిచాకిరీ చేయించటం చట్టరీత్యా నేరం, వెట్టిచాకిరీ నిర్మూలనకై ప్రభుత్వం గట్టిచర్యలు గైకొంటున్నది...' కనకయ్య డాబా ఇంట్లో వున్న రేడియోలోంచి వార్తలు వెలువడు తున్నయ్.

చెర్నాకోలతో మరొకటి అంటించాడు కనకయ్య.

ముసలయ్యలో ఓపిక చచ్చింది. అయినా..... ఆశ తాలూకూ వేగం హెచ్చింది.

అందుకే... గానుగెద్దులా గుండ్రంగా తిరుగుతూనే వున్నాడు.

[28-8-80 ఆంధ్రభూమి వారపత్రిక]

**Seenu**

**Dresses**

DIPLOMA HOLDER

87–88, Bazaar Street,

TIRUPATI

# Vimal Auto Engineering Works

**No. 8 Bye - Pass Road,**

**VELLORE - 632 004**

(N. A. Dt.) Tamil Nadu.

**Fully Equipped with Sophisticated Plant & Machinery For :**

**Crank Shaft, Engine Block, Connecting Rod, Cam Shaft, Piston.**

★

*With the best compliments of :*

**Our Sister Concern G. R. Bashiyam Eng., Works**

**Specialists In Reconditioning Cylinder Heads & Rim Plates.**